సాక్షి కామారెడ్డి

సోమవారం । 4 । ఆగస్టు । 2025



పేదల సంక్షేమమే ధ్యేయం

బీజేపీ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు.

- 8లో ▸



నిరుపయోగంగా..

జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను పట్టించుకునేవారు లేకపోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.9 /22.7

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ

నిజామాబాద్ నాగారం : తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ రాష్ట్రస్థాయి హాకీచాంపియన్‌షిప్ పోటీలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నగరంలోని పోలీస్‌పరేడ్ మైదానంలో ఉదయం 10 గంటలకు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పోటీలను ప్రారంభిస్తారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్ఈ రాపల్లి రవీందర్ సభాధ్యక్షత వహిస్తారని, ప్రత్యేక ఆహ్వానితులుగా కామారెడ్డి ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఎస్‌సీవోఎంసీ పీవీ రావు, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్ హాజరవుతున్నారని స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు ఏ గోపీ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని డివిజన్ ఇంజినీర్లు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్లు, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

6న అర్ధరాత్రి నుంచి డిచ్‌పల్లి రైల్వే గేటు మూసివేత



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : డిచ్‌పల్లి మండల కేంద్రం నుంచి ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి, దూస్‌గాం, ముల్లంగి(ఐ) గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న రైల్వే గేటును మరమ్మతు పనుల కోసం నాలుగు రోజులపాటు మూసివేయనున్నట్లు రైల్వే శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న అర్ధరాత్రి 12 గంటల నుంచి 10వ తేదీ రాత్రి 11 గంటల వరకు గేటు మూసివేసి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగించే వారు నాలుగు రోజులపాటు డిచ్‌పల్లి స్టేషన్, నాగ్‌పూర్ గేట్, 44వ నెంబరు జాతీయ రహదారిపై 7వ బెటాలియన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయం మీదుగా ఘన్‌పూర్ గ్రామానికి చేరుకోవాలని సూచించారు. ఘన్‌పూర్ నుంచి బొమ్మల గుండు హనుమాన్ మందిరం, 44వ నెంబరు జాతీయ రహదారి మీదుగా డిచ్‌పల్లి స్టేషన్‌కు చేరుకోవాలని సూచించారు.



ఖరీఫ్ సాగుతోంది

పంటలకు ఢోకా లేనట్లే!

- ఆశాజనకంగా సాగు పనులు
- చివరి దశకు వరి నాట్లు
- 4.19 లక్షల ఎకరాల్లో పంటలు

వానాకాలంలో భారీ వర్షాలు కురవకపోయినా ప్రస్తుతానికి జిల్లాలో పంటల సాగు ఆశాజనకంగానే ఉంది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 4.19 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ప్రధానంగా సుమారు 2 లక్షల ఎకరాలలో వరి నాట్లు పడ్డాయి. మరో 60 వేల ఎకరాలలో నాట్లు వేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.

కామారెడ్డి క్రైం : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5.24 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా 3.18 లక్షల ఎకరాల్లో వరి సాగవవచ్చని భావించారు. అయితే ఇప్పటివరకు మొత్తం 4.19 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో 1,95,423 ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. 51,802 ఎకరాల్లో సోయాబీన్, 32,552 ఎకరాల్లో మొక్కజొన్న, 17,713 ఎకరాల్లో పత్తి, 6,965 ఎకరాల్లో కంది, లక్షా 14 వేల ఎకరాలలో మిగతా పంటలు సాగయ్యాయి. మరో 40 వేల నుంచి 60 వేల ఎకరాల్లో వరి నాట్లు పడే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని నిజాంసాగర్ ఆయకట్టు ప్రాంతంలో ముందుగానే వరినాట్లు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు బోరుబావుల కింద చాలామంది రైతులు నాట్లు వేశారు. సాగు నీటి వసతులు తక్కువగా ఉండే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలోని కొన్ని మండలాలలో ఏటా వరి సాగు ఆలస్యంగానే జరుగుతుంది. ఆయా మండలాల పరిధిలో రైతులు ఇప్పుడు నాట్లు వేసే పనిలో ఉన్నారు.

గతేడాదితో పోలిస్తే..

ఈసారి రోహిణి కార్తెకు ముందే వర్షాలు కురిశాయి. ముందస్తుగా వర్షాలు కురియడంతో గతేడాదితో పోలిస్తే ఈసారి వానాకాలంలో జూలై నాటికి జిల్లాలో పంటల సాగు బాగా పెరిగింది. జూలై చివరి నాటికి ఈసారి 4.19 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గతేడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు తక్కువగా కురియడంతో రైతులు ఆలస్యంగా పంటలు సాగు చేశారు. దీంతో ఆ ఏడాది జూలై నాటికి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు సాగులోకి వచ్చాయి.

భారీ వర్షాలు పడితేనే..

ఇప్పటివరకు సాధారణం కన్నా తక్కువ వర్షపాతమే నమోదయ్యింది. సరైన వానలు లేకపోవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులలో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. అడపాదడపా కురిసిన వర్షాలతో కొద్దిమేర భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లో ఊటలు పెరిగాయి. ఈ నీటి వనరులతో వానాకాలం పంటలకు ఢోకా ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే యాసంగిపై ఆందోళన నెలకొంది. భారీ వర్షాలు కురియకపోతే జలాశయాలు నిండే పరిస్థితులు కనిపించడం లేదు. వరుణుడు ముఖం చాటేస్తే యాసంగిలో ఇబ్బందులు తప్పకపోవచ్చన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. అయితే ఈనెలలో మంచి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఇది అన్నదాతలకు ఊరటనిచ్చే అవకాశం.

సూచనలు పాటించాలి..



జిల్లాలో ఇప్పటివరకు 4.19 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. వరి నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. రైతులు తమ పంటల సాగులో ఏవైనా సందేహాలు ఉంటే స్థానికంగా ఉండే వ్యవసాయ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. పంటల సాగులో అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలి.

– మోహన్‌రెడ్డి, డీఏవో, కామారెడ్డి

అడవులను ఆక్రమించనివ్వొద్దు



మోస్రాలో లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు పోచారం, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- ఇప్పటికే సాగు చేసుకుంటున్నవారికి ఇబ్బందులు కలిగించొద్దు
- పర్యావరణానికి హాని కలిగించే వారిపై చర్యలు తీసుకోండి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

వర్ని: అడవులను ఆక్రమించనివ్వొద్దని, పర్యావరణానికి హాని కలిగించే చర్యలకు పాల్పడే వారిపై అటవీశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. మోస్రా, చందూర్ మండలాల్లో ఆదివారం ఆమె పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. చందూర్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, మండల మహిళా సమాఖ్యకు రుణాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇప్పటికే అటవీ భూములు సాగు చేసుకుంటున్న వారికి ఇబ్బంది కలిగించకుండా సంయమనం పాటించాలని సూచించారు. మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీలో అద్దె బస్సులను పెట్టించి ప్రతి నెలా రూ.70 వేల ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఆదాయ వనరును సృష్టించామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి డ్వాక్రా సంఘాల్లో రుణాలు ఇప్పిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, నిజామాబాద్ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు సురేశ్‌బాబా, శ్యామల, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, మాజీ జెడ్పీటీసీలు అంబర్‌సింగ్, హరిదాసు, గంగారాం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరు వర్గాల బాహాబాహీ

ప్రభుత్వ సలహాదారు పోచారం, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు మంత్రి సీతక్క పర్యటనలో బాహాబాహీకి దిగారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న రెండు వర్గాల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేస్తూ తోసుకున్నారు. ఓ దశలో ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులపై పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఇరు వర్గాలను సముదాయించి పరిస్థితి చక్కదిద్దారు.




చందూర్‌లో బాహాబాహీకి దిగిన పోచారం, ఏనుగు వర్గాల నాయకులు, కార్యకర్తలు

కూరగాయల ధరలకు రెక్కలు

కిలోకు రూ. వంద దాటిన పచ్చిమిర్చి

- బీర, కాకర కిలోకు రూ. 80..
- టమాటతోపాటు ఇతర కూరగాయలదీ అదే దారి..
- కొనడానికి ఇబ్బందిపడుతున్న సామాన్యులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పెరిగిన నిత్యావసరాల ధరలు ఏమాత్రం తగ్గకపోగా కూరగాయల ధరలు క్రమక్రమంగా పెరుగుతూ సామాన్యుడు కొనలేని పరిస్థితికి చేరుకుంటున్నాయి. కొన్ని కూరగాయల ధరలైతే ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. మార్కెట్‌కు వెళ్లి ఏది కొందామన్నా పావు కిలోకు రూ.25 నుంచి రూ.30 దాకా పలుకుతోంది. పచ్చిమిర్చి కిలో ధర రూ. వందకు చేరింది. నిన్నమొన్నటి దాకా టమాట ధర కిలోకు రూ.40 ఉండగా.. ఇప్పుడు రూ.70 వరకు అమ్ముతున్నారు. కాకరకాయ, బీరకాయలను కిలోకు రూ.80 నుంచి రూ. వంద వరకు అమ్ముతున్నారు. ఆకు కూరల ధరలూ పెరిగాయి. ఆకు కూరలు కిలోకు రూ.80 వరకు చేరాయి. మునగ కాయలు కూడా కిలోకు రూ.80కి అమ్ముతున్నారు. కొత్తిమీర మాత్రమే కాస్త చీప్‌గా దొరుకుతోంది. పది రూపాయలకు రెండుమూడు చిన్నచిన్న కట్టలు ఇస్తున్నారు. స్థానికంగా పంట తగ్గడంతో ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు శ్రావణ మాసం కావడం, శుభ ముహూర్తాల సమయం కావడం కూడా కూరగాయల ధరలపై ప్రభావం చూపుతోందని భావిస్తున్నారు.

సామాన్యుడి కష్టాలు రెట్టింపు...

మార్కెట్‌లో పెరిగిన ధరలతో సామాన్యుడి కష్టాలు రెట్టింపయ్యాయి. ఇప్పటికే నిత్యావసరాల ధరలన్నీ ఆకాశానికి చేరాయి. ఉప్పు, పప్పులతో పాటు ఇతర నిత్యావసరాల ధరలన్నీ పెరిగి కూర్చున్నాయి. మటన్, చికెన్‌తో పాటు కోడి గుడ్డు ధరలదీ అదే దారి.. ఇదే సమయంలో నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. వారానికోసారి మార్కెట్‌కు వెళ్లి రూ. వంద నుంచి రూ.150 పెడితే బస్తా నిండా కూరగాయలు వచ్చేవి. పెరిగిన ధరలతో అవే కూరగాయలకు రూ. 3 వందల నుంచి రూ.350 దాకా వెచ్చించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు మార్కెట్‌లో ధరలు చూసి రెగ్యులర్‌గా తీసుకునే కూరగాయలకు బదులు ఏది తక్కువ ఉందో అదే కొనే ప్రయత్నం చేస్తున్నారు. కొందరైతే నలుగురిని అడిగి, బేరమాడి కొంటున్నారు.

ఉల్లిగడ్డ కూడా పిరమయ్యింది..

మార్కెట్‌లో ఉల్లిగడ్డ ధర కూడా పెరిగింది. పంట చేతికొచ్చిన సమయంలో కొంత తగ్గినట్టే తగ్గినా తిరిగి పుంజుకుంది. నెల క్రితం వరకు వంద రూపాయలకు ఐదారు కిలోలు ఇచ్చేవారు. ప్రస్తుతం కిలోకు రూ.40 నుంచి రూ.50 దాకా అమ్ముతున్నారు. పచ్చళ్ల సీజన్‌లో ఎల్లిపాయల ధరలు పెరిగాయి. ఇప్పటికీ అదే స్థాయిలో ఉంటున్నాయి. పెరిగిన ధరల మూలంగా మార్కెట్‌కు వెళితే కన్నీళ్లే వస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

కోర్సులు సరే.. అధ్యాపకులేరి?

- 28 ఏళ్లుగా కెమిస్ట్రీ లెక్చరర్ పోస్ట్ ఖాళీ
- ఈ ఏడాది బైపీసీ పునఃప్రారంభం..
- జువాలజీ లెక్చరర్‌ను నియమించని బోర్డ్
- గెస్ట్ లెక్చరర్లతో పాఠాలు.. నష్టపోతున్న విద్యార్థులు



భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

భిక్కనూరు: మండల కేంద్రంలో పది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోర్సులు ఉన్నా లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. భిక్కనూరులో 1984 సంవత్సరంలో ఎంపీసీ బైపీసీ హెచ్ఈసీ, సీఈసీ కోర్సులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. అప్పట్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కళాశాల కొనసాగింది. 1994లో హుషారిలాల్ విరాళంగా అందజేసిన పది ఎకరాల భూమిలో భవనం నిర్మించి అందులోకి మార్చారు. అయితే జువాలజీ లెక్చరర్ లేకపోవడంతో బైపీసీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. అదే సమయంలో ఇక్కడి బైపీసీ గ్రూప్‌ను జగిత్యాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. అప్పటినుంచి మూడు గ్రూపులతో కళాశాల కొనసాగుతోంది. 1997 కెమిస్ట్రీ అధ్యాపకుడిని బదిలీ చేసిన ఇంటర్ బోర్డ్.. ఆ లెక్చరర్ స్థానంలో ఎవరినీ పంపించలేదు. కనీసం కాంట్రాక్ట్ లెక్చరర్‌ను కూడా నియమించలేదు. ఈ కళాశాలలో సుమారు 28 ఏళ్లుగా కెమిస్ట్రీ లెక్చరర్ లేకపోవడం గమనార్హం. గెస్ట్ లెక్చరర్‌లతో పాఠాలు చెప్పిస్తున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది.

మూడు దశాబ్దాల తర్వాత..

కళాశాలలో బైపీసీ గ్రూప్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని విద్యార్థులు ఏళ్లుగా కోరుతున్నారు. బడిబాటలోనూ విద్యార్థుల తల్లిదండ్రులు ఇదే విషయాన్ని చెప్పారు. దీంతో స్పందించిన ఇంటర్ బోర్డ్ ఈ ఏడాది బైపీసీ గ్రూపును తిరిగి ప్రారంభించింది. ప్రస్తుతం ఈ కళాశాలలో హెచ్ఈసీ ప్రథమ సంవత్సరంలో ఏడుగురు, ద్వితీయ సంవత్సరంలో ఏడుగురు విద్యార్థులున్నారు. సీఈసీలో ప్రథమ సంవత్సరంలో 22 మంది విద్యార్థుండగా.. ద్వితీయ సంవత్సరంలో 18 మంది ఉన్నారు. ఎంపీసీ ఫస్టియర్‌లో 32 మంది విద్యార్థులు చేరగా.. ద్వితీయ సంవత్సరంలో ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఈ ఏడాదే బైపీసీ పునఃప్రారంభమైంది. ప్రస్తుతం 23 మంది విద్యార్థులతో నడుస్తోంది. అయితే కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్లను నియమించకపోవడంతో గెస్ట్ లెక్చరర్లతో నెట్టుకొస్తున్నారు. ఇతర కళాశాలల్లో పనిచేస్తున్న లెక్చరర్లతో వారానికి రెండు మూడు రోజులు పాఠాలు చెప్పిస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రధాన సబ్జెక్టులకు రెగ్యులర్ లెక్చరర్లను నియమించకపోతే ఎలా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ప్రహరీ లేక ఇబ్బందులు

కళాశాలకు ప్రహరీ లేదు. దీంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీనికి తోడు రాత్రి పూట మద్యం ప్రియులు ఇక్కడికి వచ్చి మద్యం సేవిస్తున్నారు. దీంతో కళాశాల పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టులకు రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రెండుమూడు రోజులే..



కెమిస్ట్రీ లెక్చరర్ లేకపోవడంతో ఇబ్బంది అవుతోంది. వారానికి రెండు మూడు క్లాసులే నడుస్తున్నాయి. రెగ్యులర్ లెక్చరర్ ఉంటే బాగుంటుంది. ఇంటర్ బోర్డ్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రెగ్యులర్ లెక్చరర్‌ను నియమించాలి.

– శ్రీకాంత్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి

ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం



కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్లు లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతిథి అధ్యాపకులతో పాఠాలు చెప్పిస్తున్నాం. విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. రెగ్యులర్ లెక్చరర్లను నియమించాలని ఉన్నతాధికారులను కోరాం.

– జ్యోతిర్మణి రాధాదేవి, ప్రిన్సిపాల్

దేవుళ్ల పేరుతో ఓట్లడిగితే నమ్మరు

- బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు
- నాలుగు ముక్కల ఆటతో బీఆర్ఎస్ భూస్థాపితమైంది
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్
- ముగిసిన జనహిత పాదయాత్ర

ఆర్మూర్ : దేవుళ్ల పేరుతో ఓట్లడిగితే ప్రజలు నమ్మరని, ఏ పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పలా మార్చిన బీఆర్ఎస్ నాలుగు ముక్కల ఆటతో భూస్థాపితం అయిపోయిందన్నారు. రాబోయే 15 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గంలో చేపట్టిన రెండు రోజుల 'జనహిత పాద యాత్ర' ఆదివారం ముగిసింది. ముందుగా ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి శ్రమదానం చేశారు. అక్కడి నుంచి ఆర్మూర్ మండలం అంకాపూర్‌కు చేరుకున్నారు. గ్రామంలో పాదయాత్ర చేసి, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. అనంతరం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ శివారులో ఉన్న యమునా గార్డెన్స్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన పాత కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని, అలాగే కొత్త వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామని త్వరలోనే వ్యవసాయ కళాశాలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కూడా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్ కుమార్ గౌడ్

రాహుల్ స్ఫూర్తితోనే 'జనహిత'



కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను స్ఫూర్తిగా తీసుకొనే జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సూచన మేరకు తెలంగాణలో శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించేలా కృషి చేయడంతో అందరూ తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నారన్నారు. బీజేపీ మాత్రం నాగ్‌పూర్ నుంచి ఆర్ఎస్ఎస్ ఇచ్చే ఆదేశాలను పాటిస్తూ దేశ ప్రజలను మతం పేరిట విడదీస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో నిర్వహించే ఆందోళనలకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

పంటలకు తెగుళ్ల బెడద

- మందులు పిచికారీ చేసినా తగ్గని తెగుళ్ల ఉధృతి
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు కరువు



మొక్కజొన్న పంటకు మందులు పిచికారీ చేసినా తగ్గని పురుగులు



బేగంపూర్ తండా శివారులో కత్తెర పురుగు ఆశించిన మొక్కజొన్న పంట

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాస్లాబాద్, బేగంపూర్, వడ్లం, అంజని, కాటేపల్లి, చిన్న దేవిసింగ్ తండా, టీకారాం తండా, పోచారం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న, పత్తి, సోయా, పెసర, మినుము తదితర పంటలకు తెగుళ్లు ఆశించి పంటలను నష్టపరుస్తున్నాయి. ప్రతి యేటా కొత్త రకం పురుగులు ఆశించడం వల్ల రైతాంగానికి ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. వ్యవసాయ అధికారులు రైతులకు పంటలకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వకపోవడంతో రైతులు పురుగు మందుల దుకాణదారుల వద్దకు వెళ్లి వారు ఇచ్చిన మందులు పిచికారీ చేస్తున్నారు. ఈ మందుల వల్ల ఉపయోగం ఉండటంలేదు. ఏ మందులు వాడాలో తెలపాల్సిన వ్యవసాయ అధికారులు గ్రామాల్లో కనిపించడం లేదు. కొంత మంది రైతులు పశువులకు ఉపయోగించే గోమార్ మందును మొక్కజొన్న పంటకు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, స్థానిక అధికారులు రైతులకు అందుబాటులో ఉండి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏడీఏను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

మొగి పురుగు ఆశించింది



మొక్కజొన్న పంట వేశా. కాని పంటకు మొగి పురుగు ఆశించి పంట నాశనం చేస్తున్నాయి. ప్రతి యేటా కొత్త రకం పురుగులు ఆశిస్తున్నాయి. మాకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేకపోవడంతో దుకాణదారులు ఇచ్చిన మందులను పిచికారీ చేస్తున్నాం. వాటి ఉధృతి తగ్గడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– బదావత్ దశరథ్, రైతు, టీకారాం తండా

సూచనలివ్వాలి



ఆరుతడి పంటల సాగు చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని ఆ పంటల వైపు ఎక్కువగా మొగ్గుచుపుతాం. పంటలో ఇప్పుడు ఆశించి పురుగులకు ఎన్ని మందులు కొట్టినా చావడం లేదు. ప్రతి సారి కొత్త రకం పురుగులు వస్తున్నాయి. పురుగు మందుల పిచికారీపై వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుకుంటున్నాం.

– గోతి సుప్పంద్, రైతు, టీకారాం తండా

క్లుప్తంగా

'గ్రామాల్లో గోకులాష్టమి వేడుకలు నిర్వహించాలి'



కామారెడ్డి అర్బన్: విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవం సందర్భంగా గోకులాష్టమి రోజున వీహెచ్‌పీ కమిటీలున్న గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించాలని వీహెచ్‌పీ ప్రాంత సహ కార్యదర్శి చింతల వెంకన్న అన్నారు. స్థానిక ఆర్‌బీ నగర్ హనుమాన్ ఆలయం వద్ద ఆదివారం వీహెచ్‌పీ జిల్లా బైఠక్ నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు ఎ.నిత్యానందం, ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, ప్రతినిధులు గోపిరాజు శ్రీకాంత్‌రావు, ఊర పాపారావు, వడ్ల వెంకటస్వామి, వంగ ప్రసాద్, ఎల్లారెడ్డి, బిచ్కుంద, పిట్లం, నసురుల్లాబాద్ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పామ్ ఆయిల్ సాగుతో అధిక లాభాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పామ్‌ఆయిల్ సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని హిందుస్థాన్ యూనిలివర్ సంస్థ ప్రతినిధులు సూచించారు. ఆదివారం అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మాజీ సర్పంచ్ పైడి సుదర్శన్ సాగు చేసిన పామ్ ఆయిల్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు పలు రకాల సూచనలు చేశారు.

చిన్నారి చికిత్స కోసం ఆర్థిక సహాయం



మాచారెడ్డి: పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన బాలొల్ల రాజుకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం కామారెడ్డి జిల్లా మాదిగ సేవా సమితి వ్యవస్థాపకుడు గంగసాని శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. రాజు కూతురు విలాసిని అనారోగ్యంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.. ఆ చిన్నారికి రక్త కణాలు తగ్గినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి చికిత్స కోసం ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. సమితి సభ్యులు శంకర్, నవీన్ మల్లేష్, జగన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



గోపాల్‌పేటలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి



తిర్మలాపూర్‌లో..



లింగంపేటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు



రామారెడ్డిలో..



జిల్లా కేంద్రంలో ..

సాక్షినెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులు సూచించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్ల ద్వారా నాయకులు, కార్యకర్తలు.. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా డబ్బులు జమ చేస్తుందని, ఉపాధిహామీ పథకం కేంద్రం నిధులతో కొనసాగుతుందని వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రైతుల కోసం పీఎం కిసాన్ నిధులను విడుదల చేసిందని అన్నారు. పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు.



బ్రాహ్మణపల్లిలో కరపత్రాలను అతికిస్తున్న బీజేపీ నేత ఆకుల విజయ



సంగోజీవాడిలో ఆకులవిజయ సమక్షంలో బీజేపీలో చేరుతున్న వివిధ పార్టీల నేతలు

జైనుల కఠోర చాతుర్మాస్య దీక్ష..!

- 25 రోజులుగా సుశీల్ కొఠారి ఉపవాసం
- 27 రోజులుగా అర్చన బోరందియా..



అర్చన బోరందియా



సుశీల్ కోఠారి

కామారెడ్డి అర్బన్: ఒకపూట అల్పాహారం లేకపోతే నకనక లాడి పోయేవారికి ఈ వార్త నమ్మలేని నిజం. జైనుల పవిత్రమైన చాతుర్మాస్య ఉపవాస దీక్షలు నాలుగు నెలల పాటు రోజు ఒక పూట భోజనం చేయడం, రాత్రి పూట అంటే సూర్యుడు అస్తమించిన నాటి నుంచి సూర్యోదయం వరకు నీళ్లు సైతం తాగకపోవడం నియామావళి. కాగా కామారెడ్డికి చెందిన ఇద్దరు జైనులు మాత్రం ఎలాంటి ఆహారం లేకుండా ఉపవాస దీక్షలు చేస్తున్నారు. ఇది ఆశ్చర్యం కల్గించే విషయమైనా.. కఠోర నిజం. 30 ఏళ్ల సుశీల్ కొఠారి అనే యువకుడు 25 రోజులుగా ఎలాంటి ఆహారం లేకుండా ఉపవాసం పాటిస్తున్నారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన అర్చన బోరందియా అనే మహిళ 27 రోజులుగా ఉపవాస దీక్షలు చేస్తున్నారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కేవలం నీళ్లు మాత్రమే తీసుకుంటామని ఇరువురు సాక్షితో చెప్పారు. రాత్రి పూట నీళ్లు సైతం తీసుకోరు. కాలక్షేపం కోసం జైన మత గ్రంథం ఆగమ సూత్రాలు చదువుతుంటారు. దేవుని స్మరణలో ఉపవాస దీక్షలు సాధ్యమౌతాయని అన్నారు. దీక్షలు చేపట్టిన మూడు రోజుల వరకు కొంత ఇబ్బందిగా ఉన్న ఆధ్యాత్మిక చింతనలో ఇప్పటి వరకు ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు రాలేదన్నారు. జైనుల చాతుర్మాస్య ఉత్సవాల్లో భాగంగా ఉపవాస దీక్షలు అనేది సాధారణమైన విషయమని కామారెడ్డి జైన సంఘం ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్ బోరా అన్నారు. ఉపవాసంలోనూ ఆదివారం నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో సుశీల్ కోఠారి, అర్చన బోరందియా.. వారి కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా పాల్గొన్నారు.

ఐడియా అదిరెన్..!



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్లపై తిరగడం వల్ల గ్రామాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. ఈ క్రమంలో నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో ఇటీవల నూతనంగా వేసిన జాతీయ రహదారిపై నుంచి కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లాల్సి వచ్చింది. కాని కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను జాతీయ రహదారిపై నుంచి తీసుకెళ్తే రోడ్డు ధ్వంసమవుతుందని భావించిన రైతులు వినూత్నంగా ఆలోచించారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్ వెనుకవైపు భాగాన్ని మరో ట్రాక్టర్ వెనుకవైపు గునపం సహాయంతో పైకి లేపి తరలించారు.

ధర్నాకు ప్రజాసంఘాల మద్దతు



మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 5న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ఈ నెల 5న నిర్వహించే ధర్నాకు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆదివారం స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో బామ్‌సెఫ్, అంబేడ్కర్ యువజన సంఘం, ఇండియన్ లాయర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, లంబాడా హక్కుల పోరాట సమితి, బహుజన సంఘాల ఐక్యవేదిక, బీసీ సంక్షేమ సంఘం, భారత్ ముక్తి మోర్చా, బహుజన విద్యార్థి మోర్చాలు తమ మద్దతు ప్రకటించాయి. 5న మంగళ వారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొంటాయని ఆయా సంఘాల నాయకులు ప్రకటించారు. నాయకులు ఆకుల బాబు, దుబాసీ నరేందర్, శ్యాంసన్, రెవల్లి శంకర్, దాస్‌రాం నాయక్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విలువైన బంధం 'స్నేహం'

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- నగరంలో ఘనంగా సంగీత, సాహిత్య కవుల ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలం స్నేహం అసోసియేషన్ ప్రతినిధులు, కవులు

సుభాష్‌నగర్: స్నేహమనేది మానవ జీవితంలో అత్యంత విలువైన బంధమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట మున్నూరుకాపు సంఘంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలం స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగీత, సాహిత్య కవుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధన్‌పాల్ మాట్లాడుతూ.. కలం ద్వారా స్నేహం పెంచుకుంటూ, భావాల పరస్పర మార్పిడికి వేదికలను కల్పిస్తున్న కలం స్నేహం అసోసియేషన్ వంటి సంస్థల సేవలు ప్రశంసనీయమన్నారు. సమాజాన్ని చైతన్యపర్చడంలో కవులు, కళాకారులు కీలకపాత్ర పోషిస్తారని, కళలు మానవ వికాసానికి తోడ్పడుతాయని తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా ఎందరో కవులను తీర్చిదిద్దుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ ఆచార్య, ఉపాధ్యక్షుడు హరిప్రియను ప్రత్యేకంగా అభినందించారు. సమ్మేళనంలో కవిత్వాలు, సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సాహితీ, సంగీత కవులు, మహిళలు పాల్గొన్నారు.

జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఆర్మూర్‌టౌన్: హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్మూర్ పట్టణంలోని నటరాజ ఫంక్షన్ హాల్‌లో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం చైర్మన్‌గా అల్జాపూర్ దేవేందర్, ప్యాట్రన్‌గా టీ విద్యాసాగర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కోల గంగామోహన్ చక్రు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ఓ.సునీత, సాద సురేశ్, బీ శ్యామ్, బాపూరావు, ప్రధాన కార్యదరిగా పింజ సురేందర్, సంయుక్త కార్యదర్శులుగా అనుపల రజిత, రమణమూర్తి, మాధురి, సతీశ్ రెడ్డి, లింగం, కోశాధికారి గట్టడి రాజేశ్, నిర్వహణ కార్యదర్శిగా రాహుల్, ఎం.సాయికుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి, హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన శ్యామల పవన్‌కుమార్ సంఘం సభ్యులు సన్మానించారు.

క్రైం కార్నర్

దేమికలాన్‌లో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేమికలాన్ గ్రామంలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొనింటి గంగయ్య(71)కు భార్య సంగవ్వ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంగవ్వ కొన్నేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ వ్యాధి నయం కాలేదు. అలాగే తన ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయడంతో అప్పులపాలయ్యారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన గంగయ్య శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

మోపాల్: మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన కోతోళ్ల భారతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ జాడె సుస్మిత ఆదివారం తెలిపారు. భారతికి, ఆమె భర్త నర్సయ్యకు మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం కూడా గొడవ జరగడంతో తాను చనిపోతానని ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భారతి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శాంతాపూర్‌లో ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్



బిచ్కుంద(జుక్కల్): మండలంలోని శాంతాపూర్ గ్రామంలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు క్లినిక్ ప్రారంభించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శనివారం సాయంత్రం క్లినిక్ సీజ్ చేశారు. అర్హతకు మించి వైద్యం చేస్తున్నాడని గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు పెద్దకొడప్‌గల్ పీహెచ్‌సీ డాక్టర్లు రోహిత్, ఉమాకాంత్, ఆర్‌ఐ రవిందర్ శాంతాపూర్ వెళ్లి విచారణ చేపట్టారు. సమాచారం తెలుసుకున్న సదరు ఆర్‌ఎంపీ వైద్యుడు అక్కడి నుంచి పారిపోయాడు. అధికారులు క్లినిక్‌కు తాళం వేసి సీజ్ చేశారు. పైఅధికారుల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పూర్తి విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని అధికారులు తెలిపారు.

చోరీ కేసుల్లో పురోగతేదీ?

- కులాస్‌పూర్‌లో ఒకేరోజు 11 ఇళ్లల్లో దొంగతనాలు
- పదిరోజులైనా లభ్యం కాని నిందితుడి ఆచూకీ
- రెండు బృందాలు గాలిస్తున్నా ఫలితం శూన్యం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య(ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో ఇటీవల జరిగిన చోరీ ఘటనపై పురోగతి కన్పించడం లేదు. దుండగులు ఒకే రోజు ఏకంగా 11 ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడి భారీగా సొత్తు దోచుకెళ్లినా.. పోలీసులు కేసును ఇప్పటివరకు ఛేదించలేకపోయారు. పోలీసులు మాత్రం రెండు బృందాల ద్వారా గాలిస్తున్నామని చెబుతున్నా.. నిందితులను పట్టుకోవడంలో సఫలీకృతం కావడంలేదు.

గత నెలలో జరిగిన ఘటనలు..

మోపాల్ ఎస్‌ఐగా జాడే సుస్మిత బాధ్యతలు స్వీకరించిన రోజే (జూలై 6న) నర్సింగ్‌పల్లిలో ఓ చోరీ ఘటన జరిగింది. దుండగులు 11 తులాల బంగారం, రూ.35వేల నగదును దోచుకెళ్లారు. అదే నెలలో 23న అర్ధరాత్రి కులాస్‌పూర్‌లో తాళం వేసి ఉన్న 11ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. పక్కనున్న ఇళ్లకు బయటి నుంచి గొళ్లాలు బిగించి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తం 7.3 తులాల బంగారం, 54 తులాల వెండి, రూ.3.85లక్షల నగదు చోరీకి గురైంది. అంతేగాకుండా ముదక్‌పల్లి చిలుకల చిన్నమ్మ ఆలయం, మంచిప్పలోని గండి మైసమ్మ ఆలయాల్లో కూడా దొంగతనాలు జరిగాయి.

సీరియస్‌గా తీసుకున్న పోలీసులు..

చోరీ కేసులను జిల్లా పోలీస్ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. సీపీ సాయి చైతన్య స్వయంగా కులాస్‌పూర్ గ్రామాన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను నియమించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీస్‌వర్గాల భోగట్టా. కానీ నిందితుడు బోధన్‌కు చెందిన పాత నేరస్తుడిగా అనుమానిస్తున్నారు. మండలంలో వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. చోరీల నివారణకు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పట్టుకుంటాం..

కులాస్‌పూర్ చోరీ కేసులో నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశాం. దీని కోసం ప్రత్యేకంగా రెండు బృందాలు గాలిస్తున్నాయి. కొన్ని ఆధారాలు లభించాయి. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లకు తాళం వేసి వెళ్తే పక్కంటి వారికి సమాచారమివ్వాలి.

– సురేష్‌కుమార్, నిజామాబాద్ నార్త్ సీఐ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు



హర్జు నాయక్(ఫైల్)



ప్రమాదానికి కారణమైన బైకు

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామ ముఖ ద్వారం వద్ద గల జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై సందీప్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని ఎత్తుతండాకు చెందిన హర్జునాయక్(56), లాల్‌సింగ్ అనే ఇద్దరు వ్యక్తులు ఆదివారం టీవీఎస్ ఎక్సెల్‌పై గన్నారం గ్రామానికి బయలుదేరారు. గన్నారం గ్రామ ముఖ ద్వారం వద్ద గల హైవేపై వారు యూటర్న్ తీసుకుంటుండగా కామారెడ్డి నుంచి బైక్‌పై వస్తున్న సమీర్ వారిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు రోడ్డుపై పడిపోగా, హర్జునాయక్ మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు..

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా.. సిద్దాపూర్ గ్రామానికి చెందిన దంతాల రాజేందర్ (27) ఆదివారం వన్నెల్(కే) గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు రిపేర్ చేయడానికి వచ్చాడు. రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగలడంతో అతడు కింద పడిపోయి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

మాచాపూర్‌లో చోరీ



ఎల్లారెడ్డి: మండలంలోని మాచాపూర్ గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్సై మహేష్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బైరం జేకోబ్ అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. ఈక్రమంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తులంన్నర బంగారం చోరీ చేశారు. మరుసటి రోజు బాధిత కుటుంబసభ్యులు చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏఐతో వ్యాపారం మరింత సులభం

తెయూ(డిచ్‌పల్లి): వ్యాపారంలో వచ్చే అనేక సవాళ్లకు డిజిటల్ విప్లవం అవకాశాలను, పరిష్కారాలను చూపించిందని, రానున్న కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా వ్యాపారం మరింత సులభతరం అవుతుందని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, రేడియంట్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (మధ్యప్రదేశ్, జబల్పూర్) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కామర్స్ సదస్సులో ఆయన గూగుల్ మీట్ ద్వారా ప్రసంగించారు. 'డిజిటల్ ఏజ్ : ట్రెండ్స్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ అండ్ ఫ్యూచర్ బిజినెస్' అనే అంశంపై యాదగిరి మాట్లాడుతూ.. పూర్వకాలంలో వ్యాపార లావాదేవీలన్నీ రాతప్రతుల ద్వారా జరిగేవన్నారు. 1970లో ప్రారంభమైన డిజిటల్ విప్లవం క్రమంగా వేగం పుంజుకొని మరింతగా విస్తరించిందన్నారు. కృత్రిమమేధ ద్వారా విప్లవాత్మకమైన మార్పు వల్ల క్లిష్టమైన, ఖరీదైన వ్యాపార వ్యూహాలు సులభతరమైనట్లు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మోసాలకు కళ్లెం వేయవచ్చని, దుబారాను తగ్గించుకుని సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చన్నారు. సదస్సులో జబల్పూర్‌లోని రాణి దుర్గావతి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజేష్ కుమార్ వర్మ, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు సునీల్ కుమార్ పావా, సంగీత్ జాంబ్, సంజయ్ తివారి, రాజ్ కుమార్ గౌతమ్, ప్రమోద్ విశ్వకరం, ఆభా శుక్లా, రాజశేఖర్, అనుపమ పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ డే.. ఒక్కచోటికి చేరిన బాల్య మిత్రులు



దోమకొండ జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర) 1992-93 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు



కామారెడ్డిలోని ప్రగతి విద్యాలయం 1995-96 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు



మంచిప్ప జెడ్పీహెచ్‌ఎస్ 2005-06 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.